# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక





సంపుటి-10 | సంచిక-1 | ఆగస్టు-2025 | ఎడిటర్ - డాక్టర్ రాధా కుసుమ


## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...










Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com

www.kusumajayabheri.org

# కథలు

## అమాయకత్వం

రచన: సుజాత కోకిల



ధర్మయ్య అనే పేరు మోసిన రైతుకు ముగ్గురు కొడుకులు. వారి పేర్లు రాము, భీము, సోము. ఎవరికి వారు కాయ కష్టం చేస్తే బ్రతికేవారు. అందులో చిన్నవాడు సోము చాలా అమాయకుడు.ఎవరేం చెప్పినా పనిచేస్తూ, ఇంట్లో అందరితో కలుపుగోలుగా ఉండేవాడు.

సోమును అమాయకుడని, చెప్పిన పనులు చేస్తుంటా వాడని, సోముని అందరు బాగ చూస్తుంటారు. పెళ్లి కాకముందు ఒక ఎత్తు, పెళ్లయ్యాక ఒక ఎత్తు అన్నట్టుగా రాముకు, భీముకు పెళ్లి చేశారు. ఇద్దరి భార్యలు అత్తింటికి వచ్చాక, ఇద్దరు ఇద్దరే అన్నట్టు అత్త మామలకు తెలియకుండా సోముతో ఇంటెడు చాకిరి చేయిస్తూ, భర్తలు రాగానే ఏం తెలియకుండా మామూలుగా సోముతో ప్రేమగా ఉండేవారు.

సోము అంటే తల్లిదండ్రులకు చాలా ప్రేమ. సోము ఇంటెడు చాకిరి చేస్తుండగా అత్తగారు చూశారు.

"ఏంటి కోడండ్లు!మీరు ఊరికే కూర్చొని మరిదితో అలా చాకిరి చేయిస్తున్నారు? వాడు అమాయకుడు.వానికి ఏం తెలియదు. వాడికి ఇలాంటి పెద్ద పెద్ద పనులు చేతకావు." అంటూ మందలి0చింది. "ఏమైంది మీ అబ్బాయికి?తిని కూర్చుంటే గుట్టలైన కరుగుతాయని మీకు తెలియదా? ఈ మాత్రం పనులు చేస్తే ఏంటి?" అంటూ ఎదురు సమాధానం చెప్పారు.

కోడళ్ళు అలా అనేసరికి ఏం చెప్పాలో తెలియక గమ్మున లోపలికి వెళ్ళింది అత్తగారు.

“ఏమండీ చూశారా!ఇద్దరు కోడళ్ళు వెర్రి బాగుల వాడితో ఎలా పని చేయిస్తున్నారో,? నాకు చాలా బాధగా ఉందండి. ఇలాంటి మోటు పనులు మనం ఎన్నాడైనా చెప్పామా?”అంటూ బాధపడింది.

“అలా వద్దని చెప్పడంతో నా పైకి ఎదురు తిరిగారు.నేను కోడళ్ళతో అనిపించుకోవడం బాగోదని వచ్చానండి “అంది.

“గట్టిగా చెప్పకపోయావా వాళ్లకి “అన్నాడు, ధర్మయ్య. “కొడుకులు బాధపడతారేమోనండి నేను చెప్పానంటే వాళ్లు గొడవలు పడతారు. పిల్లలు గొడవ పడటం నాకు బాగోదండి” అంది.

అత్తగారు ఏమి అనకపోవడంతో వారి అరాచకం ఎక్కువైపోయింది. సోము బలహీనుడు.ఎక్కువ పని చేయలేడు. అలవాటు లేని పని కనుక, అలసటతో విపరీతంగా జ్వరం వచ్చింది.

జ్వరం వచ్చినా లేమ్మని, పని చేయమని, తట్టి లేపుతున్నారు. సోము. లేవలేక సొమ్మసిల్లిపోయాడు. ఎంతమంది డాక్టర్లు చూపించిన నయం కాలేదు. “ఏంటి డాక్టర్,ఎందుకు ఇలా అయింది అని అడిగారు?“ “ఈ అబ్బాయి బలహీనంగా ఉన్నాడు. ఎక్కువ పని చేయడం వల్ల ఇలా నీరస పడిపోయాడు”. అంటూ డాక్టర్ చెప్పాడు.

“మా తమ్ముడు పనిచేయడం ఏంటి? మా తమ్ముడికి మేము ఏపని చెప్పము. వాడి తోచిందే వాడు చేస్తాడు. వాడి సంగతి మాకు తెలుసు.మేము ఏ పని చేయకుండా చూసుకుంటాం.ఇలా ఎందుకైంది?”అంటూ ఆలోచిస్తూ,తల్లి వైపు తిరిగి చూశాడు, రాము బాధగా అప్పుడు చెప్పక తప్పలేదు “వీడు తిని కూర్చుంటున్నాడు, ఆస్థిలో వీడు పాలు ఏమైనా విడిచిపెడతాడా?”అంటూ, వీడితో రోజంతా గొడ్డు చాకిరి చేయించారు.వాడికి అలవాటు లేని పని.అందుకనే ఇలా అయింది “అంటూ కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ చెప్పిందితల్లి.

“ఏంటమ్మా నువ్వు!ఇంట్లో ఇంత జరుగుతుంటే మాకు ఎందుకు చెప్పలేదు?”అంటూ కోపం చూశారు అన్నదమ్ములిద్దరూ.. ఇలాజరుగుతోందని తెలిసి, నువ్వు ఎందుకు గమ్మున ఎందుకు ఊరుకున్నావ్?వాడికి ఏమన్నా అయితే వాని గతి ఏంటి “ అడిగాడు భీము.

“నేను మీతో చెప్తే మీకు మీకు మధ్య గొడవలు అవుతాయి అది నాకు ఇష్టం లేదు”. అందితల్లి. అయితే..? గొడవలు అవుతాయని ఊరుకుంటే తమ్ముని పరిస్థితి ఏంటమ్మా? వాడు ఎంత అమాయకుడు. అభం శుభం తెలియని వాడు” అన్నాడు భీము.

"మా తమ్ముని ఈ విధంగా హింసిస్తారా? మీకేం అన్యాయం చేశాడు మా తమ్ముడు.? మీ ఆస్తులు అంటున్నారు మీ తల్లి గారి ఇంట్లోంచి పట్టుకొచ్చారా? మీరు ఇంట్లో ఉండడానికి వీల్లే"దంటూ మెడపట్టి బయటకు గెంటబోయారు.

"వద్దండి.. మమ్మల్ని కొట్టకండి... మేము తప్పు చేశాము...మమ్మల్ని క్షమించండి, మీ తమ్ముణ్ణి మీరు ఎలా చూశారో మేము కూడా అలాగే చూస్తాం. ఈసారికి క్షమించండి "అంటూ వేడుకుంటున్నా బయటకి గెంటుతున్నారు అన్నదమ్ములిద్దరూ.

"రాము! భీము! మీకేమైనా మతి పోయిందా,కోడళ్లను అలా బయట గెంటేస్తున్నారు.?వాళ్ళు ఇప్పుడు ఎక్కడికి వెళ్తారు? కోడళ్లు చేసిన తప్పే మీరూ చేస్తారట్రా? మీకు వాళ్ళకి తేడా ఏంటి? కోడళ్ళని లోపలికి తీసుకెళ్లండి." కొడుకుల్ని మందలించింది తల్లి.

"అమ్మా! నువ్వు మరీ గారాబం చేస్తున్నావ్, కనుకే నీ అలుసు చూసుకొని ఇలా చేస్తున్నారు. వీళ్ళ అంతు చూడాల్సిందే" అన్నారు. "అత్తయ్య మమ్మల్ని క్షమించండి ఇంకోసారి తప్పు చేయము. సోముని మా కన్న బిడ్డల చూసుకుంటాం. తప్పైందని" కాళ్ళపై పడి క్షమించమని వేడుకున్నారు. "కుటుంబంలో అందరూ ఒకరినొకరు అర్థం చేసుకుని ఈర్ష ద్వేషాలు లేకుండా అంతా మనమేని కలుపుగోలుగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుంది. అమ్మా! నాకు కొడుకులు ఎట్లాగో మీరు అలాగే. ఇందులో ఒకరి ఎక్కువ ఒకరు తక్కువ అంటూ ఏమి ఉండదు. తల్లి బిడ్డలందరికీ ప్రేమను ఒకేలా పంచుతుంది." చెప్పింది తల్లి.

"అత్తయ్య! మీ మంచి మనసును అర్థం చేసుకోలేకపోయాం. మమ్మల్ని క్షమించండి" అన్నరిద్దరూ ముక్త కంఠంతో. "నేను ఎప్పుడో క్షమించాను. మీ భర్తలను కూడా క్షమించమని అడగండి" చెప్పింది. తల్లి. "మా అమ్మ చెప్పిందని మేము ఊరుకున్నాం. కానీ, ఇంకోసారి ఇలా జరిగిందంటే నిజంగానే ఊరుకునేది లేదు' అంటూ మందలించి లోనికి వెళ్లారు, అన్నతమ్ములిద్దరూ.

ఇద్దరు కోడండ్లు కుటుంబాన్ని అర్థం చేసుకొని సోమును కూడా తమ సొంత బిడ్డలా చూసుకుంటూ,అత్తమామ సేవలో తరించిపోయారు. కొన్నాళ్ళకి పండంటి బిడ్డలను కన్నారు.



ఆ బిడ్డలను సోము ఎంతో బాగా చూసుకుంటూ, ఆ పిల్లలతో కాలక్షేపం చేస్తూ ఆనందంగా ఉంటున్నాడు.

# ధారా వాహిక - 9 చైతన్య స్రవంతి

సాంఘిక నవల

రచన: డా జి భవానీ కృష్ణ మూర్తి

స్రవంతి డిశ్చార్జ్ అయి బాబు తో పాటు ఇంటికి వచ్చింది. ఆ రోజు చైతన్య చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఇల్లంతా డెకరేట్చే యించాడు.

మా ఇంట అడుగుపెట్ట బోతున్న బుల్లి యువరాజుకి స్వాగతం ఎదురుగా ఉన్న గోడకి బంగారురంగు అక్షరాలతో స్వాగతతోరణం ఏర్పాటు అయింది. కొడుకు సంతోషాన్ని ముచ్చటగా చూశారు రాఘవరావు దంపతులు. రామానుజం కూతురు అవిటిపిల్ల అయిన స్వప్నని, అదికూడా ఆర్ధికంగా తమని గట్టేక్కించడానికి పెళ్ళి చేసుకోవడం వారికి ఎంత మాత్రం నచ్చలేదు. స్వప్న గర్భవతి అని తెలిసి, విడాకులకోసం అప్లై చేస్తే అమ్మాయికి డెలివరీ అయ్యేవరకు రామానుజం విడాకులకి అడ్డు పడడం, డెలివరీ అప్పుడు బిడ్డతండ్రిగా చైతన్య పేరు రాస్తానని, అలా ఒప్పుకుంటే వెంటనే విడాకులకి అంగీకరిస్థానని, లేకుంటే తన కూతురికి విడాకులివ్వకుండా చైతన్య మరోపెళ్ళి చేసుకున్నందుకు కేసు పెడతానని ఎంత హంగామా చేశాడో గుర్తుకొచ్చింది ఇద్దరికీ. లాయర్ తెలివిగా పెళ్ళి నాటికే ఆమె గర్భవతి అని, డాక్టర్ సర్టిఫికెట్ కోర్టుకి సమర్పించి, డాక్టర్ శ్యామలని సాక్షిగా కోర్టుకి రప్పించి, కేసు తమకి అనుకూలంగా వచ్చేలా చేశాడు.

తమ కారణంగా కొడుకు జీవితం అలా అయిపోయిందేవిటా అని ఇన్నాళ్లు బాధ పడేవారు. ఇప్పుడు ఆ బాధలన్ని పోయి కొడుకు సంతోషంగా ఉండడం చూసి వారికీ చాలా ఆనందంగా ఉంది. కారు దిగి వస్తున్న తల్లీ బిడ్డలకి ఎర్రనీళ్లతో దిష్టి తీసి, హారతిచ్చి లోపలికి తీసుకొచ్చింది జానకమ్మ.. స్రవంతి లోపల అడుగు పెడుతూనే స్వాగతతోరణం చూసి చాలా సంతోషించింది. అంతలోనే తమ గుమ్మం ముందు పావ, స్వప్న రాసిన ఉత్తరం అన్నీ గుర్తుకొచ్చి ఆమె ముఖంలోని సంతోషం మాయమైంది. గబ గబా తమ గదిలోకి వెళ్ళిపోయింది. ఫోన్ రావడంతో "నేనలా సైట్ దగ్గరకి వెళ్ళొస్తా. బాబు జాగ్రత్త!" చెప్పేసి, హడావిడిగా వెళ్ళిపోయాడు చైతన్య. కార్తీక ఫోన్ చేసి బాబుని చూసి, ముచ్చట పడింది. జాగ్రత్తలు చెప్తూ స్రవంతితో, తల్లీ దండ్రులతో మాట్లాడింది. శంకరం ఫోన్ చేసి బాబుని చూసి చెల్లెలికి, బావగారికి శుభాకాంక్షలు చెప్పాడు.

అందరితో సంతోషంగా మాట్లాడుతున్నా, చైతన్య కనపడగానే స్రవంతి మొహం ముడుచుకునిపోతోంది.

ఆ రోజు ఖలీల్, అతని భార్య అన్వరీబేగం పాపని తీసుకుని బాబుని చూడడానికి వచ్చారు.బాబుని ఎత్తుకుని అన్వరీ బేగం ముద్దులా డుతుంటే చైతన్య, ఖలీల్ చేతుల్లో ఉన్న పాపని అందుకుని ముద్దులాడుతూ "మీకు బాగా అలవాటు

అయినట్లుంది. పేరేం పెట్టారు? అడిగాడు.

"ఫాతిమా " చెప్పిందామే. కాస్సేపు ఎత్తకుని, ఐదు లక్షల చెక్ ని ఖలీల్ కి ఇస్తూ, "చెప్పానుగా. పాప పక్కబట్టల్లో ఆ లెటర్ తో పాటు ఈ చెక్ కూడా ఉంది.ఇది ఆ పాప పేరు మీద డిపాజిట్ చెయ్యి. లేదా నీ బిజినెస్ కి వాడుకో. లాభాలు వచ్చినప్పుడు పాప పేరున వెయ్యి. ఆమె చదువుకి, పెళ్ళికి ఉపయోగ పడుతుంది "అని చెప్పాడు.

కాసేపు కూర్చుని వాళ్ళు వెళ్లిపోయాక "అత్తయ్యా!బాబుకి దిష్టి తియ్యండి" అంది. "నేనూ అనుకున్నానమ్మ, తీద్దామని "అంటూనే జానకమ్మ లోపలికి వెళ్లి,ఉప్పు మిరపకాయలు తెచ్చి తల్లి, బిడ్డలకి దిష్టి తీసి,"నువ్వు కళ్ళు, కాళ్ళు కడుక్కుని, బాబుకి తడిచేత్తో తుడిచి, పడుకోబెట్టు."అని,లోపలికెళ్లి అవి నిప్పుల్లో వేసింది జానకమ్మ..

స్రవంతిలోని మార్పు గమనించి గదిలోకి వెళ్ళాక చైతన్య "బుజ్జీ!ఏమైంది? నీలో ఏదో మార్పు కనిపిస్తోంది" అన్నాడు ఆదుర్దాగా "ఏమి లేదు.."దృష్టి చంటి పిల్లవాడిమీదకు మరల్చుకుంది. "బాబుని, ఆమెని కలిపి తన చేతుల్లో ఇముడ్చుకుని "చూడు. ఇది చాలాసంతోషంగా ఉండవలసినసమయం.నువ్విలామొహంమాడ్చుకుంటున్నావంటే దీని గురించో నువ్వు మధన పడుతున్నావని నాకనిపిస్తోంది. మీ అమ్మ గుర్తుకొచ్చారా?"అన్నాడు, లాలనగా .
"అదేమీ లేదు "అంటూనే,తన కుడి చెయ్యి అతని మెడ చుట్టూ వేసి,"మీరు.. మీరు.. మా ఇద్దరికే సొంతం కదూ?" అంది గద్గదస్వరంతో. "బుజ్జీ! " ఆమెని మరింత దగ్గరకు హత్తుకుని "నీకెందుకు ఆ అనుమానం వచ్చింది?"అన్నాడు, అయోమయంగా. "ఏమో... మీరు.. ఆ పాపని అంతగా ముద్దులాడడం నాకు.... నచ్చలేదు "అంది.
"అంటే.... సూటిగా చెప్పు" అన్నాడు సీరియస్ గా చూస్తూ. స్రవంతి మాట్లాడకుండా తల దించుకుంది. వారిని వదిలి దూరంగా వెళ్లి నిలబడి "నువ్వు నన్ను నమ్మావనుకున్నాను. ఆ బిడ్డ నాబిడ్డ ఏమో అని నీ అనుమానం అన్న మాట..ఆమె రాసిన ఉత్తరం చూశావ్. అమ్మా, నాన్న చెప్పింది విన్నావ్, కోర్టు వాయిదాలప్పుడు లాయర్ తో మాట్లాడడం విన్నావ్. అన్నీ విన్నాక కూడా నా పై అనుమానమా? స్టుపిడ్!ఇదే మరో సమయం అయితే నీ చెంప పగలగొట్టేవాడిని" అన్నాడు, చెయ్యెత్తి కొట్టబోయి కోపాన్ని అణుచుకున్నాడు.
బాబుని బెడ్ మీద పడుకోబెట్టి వెళ్లి అతని చేతిని అందుకుని, తన చెంప మీద కొట్టుకుంటూ, "మీరు కొట్టండి, తిట్టండి కానీ , "మీ ప్రేమని మరొకరితో షేర్ చేసుకోలేను. ఆ ఊహే నాకు నరకంగా అనిపిస్తోంది" అంది ఏడుస్తూ. అతని కోపం చప్పున చల్లారిపోయింది "పిచ్చిదానా!మనిద్దరం ఒకరికొకరం అంతే. మన మధ్య మరొకరికి స్థానం లేదు. తెలియక, అప్పుడున్న పరిస్థితులను బట్టి ఆమె మెడలో తాళి కట్టాను అంతే. అదృష్టవశాత్తు ఆమె గర్భవతి ముందే, తెలిశాక ఐదు నిముషాలు కూడా ఆమెతో నేను మాట్లాడింది లేదు. ఇప్పుడైనా ఆమె, పాపని నాదగ్గరకి

పంపిందంటే స్నేహధర్మంగా పాపని నేను కాపాడతానని నమ్మింది కనుక. నాన్న, వాళ్ళ నాన్న కలిసి బిజినెస్ చేసేప్పుడు. మాకుటుంబాల మధ్య అప్పుడప్పుడు రాక పోకలుండేవి. అవిటిపిల్ల అనే జాలి ఉండేది. అంతే."ఆమెని మరింత దగ్గరకు హత్తుకుంటూ.," పిచ్చి పిచ్చి ఆలోచనలతో నాకు చికాకు తెప్పించావంటే "తన నుదురు తో ఆమె నుదుటిని ఢీ కొట్టి,"వెళ్ళు, బాలెంతరాలివి. లేకపోతే.. నా సమాధానం వేరేగా ఉండేది "అన్నాడు సీరియస్ గా. రెండు చేతులతో అతని నడుముని చుట్టి, ఛాతీ మీద ముద్దు పెట్టుకుని కళ్ళనీళ్లతోనే"ఎందుకో.. ఆ ఊహే....." "ప్చ! పిచ్చి పిచ్చి ఆలోచనలు మానమని చెప్పానా?ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. నువ్వు, బాబు నాకు రెండుకళ్ళు. ఈ మాట ఎప్పుడూ మరిచిపోకు.. స్వప్న విధి వంచిత.. ఆమె అంటే జాలి మాత్రమే వుంది."ఆమె చేతిలో చెయ్యివేసి, గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు "అబ్బాయ్!" రాఘవ రావు పిలుపుతో హడావిడిగా బయటికి వెళ్ళిపోయాడు. తేలిక పడిన మనస్సుతో బాబుని ఒడిలోకి తీసుకుంది, పాలివ్వడానికి.

ఒక పాత ఇల్లు అమ్మకానికి వస్తే,చైతన్య ఇచ్చిన ఐదులక్షల చెక్ తో కోనేశాడుఖలీల్. ప్లంబర్, ఎలక్ట్రీకల్ పనులు చేయించే కాంట్రాక్టర్ జోసెఫ్ కూడా వారికి అత్యంత సన్నిహితుడయ్యాడు. సుమారుగా వెయ్యి గజాలున్న ఆ ప్రదేశంలో ఉన్న పాత ఇల్లు కూలగొట్టి ముగ్గురు ఆ స్థలంలో, సెల్లార్ లో పార్కింగ్, వారివృత్తికి సంబంధించిన పరికరాలు, సామాగ్రి కోసం గోడౌన్ గాను, మొదటి అంతస్తులో ఒక బెడ్ రూమ్, హాల్,కిచెన్, పైన మాస్టర్ బెడ్ రూమ్ కాక మరో రెండు బెడ్ రూమ్స్, ఆ పైన మూడు భవనాలను కలుపుతూ, తీరిక సమయాల్లో అందరూ కలిసి కూర్చునేలా రూఫ్ గార్డెన్. చుట్టూ మొక్కలు మధ్యలో టేబుల్స్, కుర్చీలు ఏర్పాటు అయ్యాయి. ఇల్లంతా ఖలీల్ ఫ్యాక్టరీలో తయారైన అందమైన డెకరేటివ్ వాల్స్ తో ఆకర్షణీయంగా, జోసెఫ్ చేసిన  చక్కని లైటింగ్స్ తో, ముందుభాగంలో పొడవైన కారిడార్ తో మూడు ఇళ్లను కలుపుతూ ఒకే లిఫ్ట్. ఇంటి స్థలం, భవననిర్మాణం కోసం అయిన ఖర్చు, మైంటెనెన్స్ ఛార్జిలు ముగ్గురు సమానంగా పంచుకున్నారు. ఎవరికీ ఇష్టం లేకపోయినా, మిగిలిన ఇద్దరిలో ఎవరో ఒకరు ఆ డబ్బు ఇచ్చేసి ఆ పోర్షన్ తమ పేర రాయించుకోవచ్చు. వారు దానిని ఎవరికైనా అద్దెకి ఇచ్చుకోవచ్చు, లేదా వారే వాడుకోవచ్చు.. అలా అగ్రిమెంట్ రాసుకుని రిజిస్టర్ చేయించుకుని, ముగ్గురు తలో కాపీ దగ్గర పెట్టుకున్నారు. ఖలీల్, జోసెఫ్ అవసరం లేదని అన్నా, రామానుజం అనుభవంతో, రాఘవరావు హెచ్చరికతో చైతన్య ఒక లాయర్ ని పిలిపించి,అగ్రిమెంట్ రాయించి ముగ్గురి సంతకాలతో అగ్రిమెంట్ రిజిస్టర్ చేయించారు. ఒక భవనం నిర్మించాలంటే ముగ్గురు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. పనిలో ఎలాంటి కక్కూర్తితనం లేకుండా నిజాయితీగా చెయ్యాలనే అంకితభావం ఉంది. అదే ముగ్గురినీ ఒకటిగా కలిపింది. కొన్నాళ్ళు వారిదా కులం, వీరిది ఈ కులం అంటూ దూరం దూరంగా ఉన్న స్రవంతి, ముగ్గురు మిత్రులు అరమరికలు లేకుండా ఉండడం చూసి, అన్వరీ

బేగం, మేరీ తనపట్ల ఎంతో అభిమానం చూపడంతో తనూ వారితో కలిసిపోయింది. భిన్నత్వంలో ఏకత్వం అన్నట్లుగా కలిసిపోయిన వారిని చూసి రాఘవరావు, జానకమ్మలు కూడా పట్టింపులు వదిలేశారు. "చిన్నప్పుడు మా ఊళ్ళో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి అవి గుర్తుకొస్తున్నాయి "అనేవాడు రాఘవ రావు. భోజనసమయంలో, క్రిస్మస్, రమజాన్ వంటి పండుగ సందర్భాలలో వారు ప్రత్యేక వంటలు చేసుకున్నపుడు, స్రవంతి అసలు అటువైపు వెళ్ళదు. శాకాహారులుగా మారిపోయిన రాఘవరావు,జానకమ్మ కూడా అటు వెళ్లడం మానేశారు. కంపెనీ కోసం చైతన్య వెళ్లినా, స్రవంతి చూసీ చూడనట్లు ఉండడం నేర్చుకుంది. ఆ ఫుడ్ తీసుకున్నప్పుడు చైతన్య స్రవంతిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక గెస్ట్ రూమ్ లో పడుకుంటున్నాడు. .********

అర్ధరాత్రి నిద్రలో ఉన్న స్రవంతి సెల్ రింగ్ అవుతుంటే ఉలిక్కి పడి లేచి చూసింది. "ఇంతరాత్రి వేళ ఎవరూ బుజ్జీ?"పక్కకి ఒత్తిగిలి పడుకుంటూ అన్నాడు చైతన్య.

"మా చెల్లి.. చిన్ని..." చెప్పి,సెల్ ఆన్ చేసి "ఆ చిన్ని.. చెప్పు. ఇంత రాత్రి వేళ కాల్ చేశావు.. ఏంటి...."అడిగింది కంగారుగా "అక్కా.......అక్కా...."

(సశేషం)



# హాస్యం

మా అమ్మాయి పదో తరగతి చదువుకునే రోజులు..
"ఏంటి..అబ్బాయి బొమ్మ సగం సగం వేశావ్ ..
ఒకటే కన్ను గీశావ్.. అడిగాను..
"ఒక కన్ను వేసి ఉంచాను డాడీ.." చమత్కారంగా చెప్పింది.

## దేవా.. దీనం

మనవడు "దేవా" అల్లరి పిల్లాడు. తాత టీవీ చూస్తూ ఉంటే రిమోట్ లాక్కుంటాడు. న్యూస్ పేపర్ చదువుతూ వుంటే తీసుకుని అందకుండా పరుగులు తీస్తాడు..పాపం..ఆ తాత గారు వైరాగ్యం తో ఇలా అనుకుంటూ ఉన్నారు..
ఈ ఇంట్లో అంతా "దేవా .. దీనం" గా ఉంది.. ఏదీ నా చేతిలో లేదు...



భమిడిపాటి వెంకటేశ్వర రావు

# అహంకారం

రచన: కాను కొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు

శేఖర్, వనజ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అన్యోన్య దాంపత్యంతో, ఇద్దరు కవల మగ పిల్లల్ని కన్నారు.

పిల్లలు పుట్టిన తర్వాత, ఇద్దరివైపు తల్లిదండ్రులూ వారి ప్రేమ వివాహాన్ని ఆమోదించి, రాకపోకలు మొదలయ్యాయి. పిల్లలు స్కూలుకి వెళ్తున్నారు. ఇద్దరూ రెండవ తరగతి చదువుతున్నారు.

ఒకరోజు ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది పిల్లలు గొడవ చేస్తూ ఉండడం వల్ల, శేఖర్ బయటికి వెళ్లి ఫోన్ మాట్లాడాడు. వనజకు అనుమాన బీజం మొలకెత్తింది

అతని ఫోన్ చెక్ చేసింది. కాల్లాగ్‌లో "ప్రియ" అనే అమ్మాయితో కాల్ చేసి మాట్లాడినట్లు కనిపించింది.

అప్పటినుంచి నమ్మకం లోపించిన సంభాషణలు మొదలయ్యాయి...

"నిన్న ఎవరిదగ్గరినుంచి ఫోన్ వచ్చిందో చూశాను. నువ్వు ఎందుకు—చేస్తున్నావు? ప్రియ ఎవరు?! అడిగింది వనజ.

" ఆఫీస్‌లో కోలీగ్ ఫోన్ చేసింది. ఆ విషయాన్ని నీకు చెప్పాల్సిన అవసరం లేదు". మెల్లిగా చెప్పాడు శేఖర్..

"నా మీద మోజు తీరిపోయిందా? లేకపోతే నాకు తెలియకుండా ఇంకెవరైనా ఉన్నారా?" ప్రశ్నించింది సూటిగా వనజ.

'ఎప్పుడూ అనుమానంతో ఉంటే ఎలా బతకాలి నేను?అడిగాడు శేఖర్. "ఇంత సంపాదిస్తున్నా గౌరవం లేకుండా పోయింది. "కోపంగా అన్నాడు శేఖర్.

"నువ్వు సంపాదించేదానికంటే నేను తక్కువ కాదు. ఇంట్లోనూ, నేను చాకిరీ చేస్తుంటాను."బదులు ఇచ్చింది వనజ.

"ఇలా మాట్లాడావంటే నాకు కోపం వస్తుంది. నేను బయటకి పోతా!" విసుగ్గా అన్నాడు శేఖర్.

“ఇప్పుడు నాతో కూర్చుని రెండు నిమిషాలు మాట్లాడటానికి కూడా నీకు సమయం ఉండదు.అంతేగా? “ అంది వనజ.

“ఇంటికి వచ్చాక ప్రశాంతంగా ఉండాలనుకుంటే, నువ్వు కొత్తగా గొడవలు పెడతావు.” విసుక్కున్నాడు కోపంగా శేఖర్.

“అంతేనా? నేనుంటే నీకు శాంతి పోతుందా?” ఏడుస్తూ అడిగింది వనజ...
“నిన్న మా అమ్మ చెప్పింది... నువ్వు ఈ మధ్య చాలా స్వేచ్ఛగా తిరుగుతున్నావట!” అడిగాడు శేఖర్.

“నాకు జీవించడానికి కూడా హక్కులేదా? అమ్మగారింటికి వెళ్ళడానికి నీ అనుమతి తీసుకోవాలా?”

“నువ్వు మారాలి. ఇలా అయితే మనం కలిసి ఉండలేం. “గట్టిగా చెప్పాడు శేఖర్.

“పిల్లల స్కూల్ ఫీజు కట్టమని చెప్పాను. పట్టించుకోలేదు. నేనే వెళ్లి కట్టాను. ఇది బయట తిరగడమా”?అడిగింది వనజ

“నాకు పని ఒత్తిడి ఉంది. ప్రతి విషయంలో నన్నే నిందించడం ఎందుకు? నీకూ బాధ్యత ఉందిగా...”అన్నాడు శేఖర్

“నీవు ఈ మధ్య మారిపోయావు. ప్రేమగా మాట్లాడటమే లేదు”.శేఖర్..
“ప్రేమ అనే మాట మన మధ్య ఎప్పుడు ఉంది గనుక?” వనజ.

ఈ తరహా సంభాషణలు రోజూ వారిద్దరి మధ్య చోటు చేసుకుంటున్నాయి. ఒకరోజు శేఖర్ ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం వేసి ఉంది. పిల్లలు స్కూల్ నుంచి వచ్చి, ఎవరూ పట్టించుకునే వాళ్ళు లేక. మెట్ల మీద కూర్చుని ఏడుస్తున్నారు.

శేఖర్ కోపం నెత్తికి ఎక్కింది. కాసేపటికి వచ్చిన వనజమీద  అరిచాడు
“బాధ్యత లేకుండా ఎక్కడికి వెళ్ళావు?” అడిగాడు శేఖర్.

“మా అమ్మగారి ఇంటికి వెళ్ళాను. దారిలో ట్రాఫిక్ వల్ల లేట్ అయింది చెప్పింది” వనజ. “దానికి అంత అరుపు అవసరమా?”

వనజ గట్టిగా మాట్లాడి బెడ్రూంలోకి పోయి తలుపేసుకుంది...

ఒకరోజు శేఖర్ ఫ్రెండ్స్ పార్టీ అంటూ,మద్యం తాగి వచ్చాడు.

వనజ గొడవ చేసింది. తాగిన మత్తులో, శేఖర్ వనజపై చేయి చేసుకున్నాడు. వనజ అహం దెబ్బతింది. బట్టలు సర్దుకుని, పిల్లల్ని తీసుకుని అర్ధరాత్రి పుట్టింటికి వెళ్లింది.

తల్లిదండ్రులు మందలించారు."తప్పు "అని చెప్పబోయారు...
"ఇక్కడ ఉండిపోను. ఉద్యోగం దొరికేదాకా ఉండనివ్వండి" విసురుగా చెప్పింది, వనజ తల్లిదండ్రులకు.

పిల్లల్ని తల్లికి అప్పజెప్పి, ఉద్యోగంలో చేరి, వేరే కాపురం పెట్టిన తర్వాత, విడాకుల కోసం లాయర్‌ను సంప్రదించింది.

శేఖర్ కూడా, "ఆమెకు అంత పట్టుదల ఉంటే, నేను ఎందుకు దిగిరావాలి?" అనుకున్నాడు.

సంవత్సరం తర్వాత విచారణ జరిపి, కోర్టు ఇద్దరికీ విడాకులు మంజూరు చేసింది.

ఇప్పుడు శేఖర్, వనజ స్నేహితులు అడిగారు: "మీరిద్దరూ ఎందుకు విడాకులు తీసుకున్నారు? అంత బలమైన కారణమేమిటి?"

## ఇద్దరూ ఒకటే సమాధానం చెప్పారు:
## "అతనికి గర్వం... ఆమెకు గర్వం..."



# అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవ శుభాకాంక్షలు







మన జన జీవన సంస్కృతికి
ప్రతిబింబాలైన జానపద కళలను పరిరక్షించుకోవాల్సిన
బాధ్యత ఎంతైనా ఉంది


## కుసుమ జయభేరి



తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక



Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com

www.kusumajayabheri.org